క్లుప్తంగా

సమష్టిగా తెల్లదోమను అరికట్టాలి

అంబాజీపేట: రైతులంతా సమష్టిగా తెల్లదోమను అరికట్టేందుకు సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటిస్తే ఫలితాలు సాధించవచ్చని రావేప్ విద్యార్థులు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో తెల్లదోమ నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తెల్లదోమ నివారణకు వేప నూనె, ఐసేరియాలను పిచికారీ చేయాలన్నారు. కొబ్బరిచెట్లకు పసుపు రంగు జిగురుఅట్లను అతికించి వాటిపై ఆముదం పోస్తే కొంతవరకు దోమల నివారించవచ్చని రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని సీనియర్ సైంటిస్ట్ ఎన్‌బీవీ చలపతిరావు శాస్త్రవేత్త వి.అనుష పర్యవేక్షణలో నిర్వహించమని రావేప్ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రంగా మిత్రమండలి ట్రస్ట్ యూత్ కార్యదర్శిగా నోకేష్



అంబాజీపేట: అంబాజీపేట ఆంధ్ర–తెలంగాణ రంగా మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ మండల యూత్ కార్యదర్శి మంచాల నోకేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ట్రస్ట్ అధ్యక్షుడు ప్రసన్న పూర్ణచంద్రరావు వద్ద నుంచి మంగళవారం నియామక ఉత్తర్వులు అందినట్లు నోకేష్ తెలిపారు. తనకిచ్చిన పదవిపై అంకితభావంతో పనిచేసి ట్రస్టు తరఫున సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. నోకేష్‌కు పదవి రావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

చురుగ్గా రక్తహీనత పరీక్షలు

ఆలమూరు: చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనతను నివారించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సుస్థిర అభివృద్ధి–లక్ష్యాలు అనే అంశంలో భాగంగా వైద్యారోగ్య సిబ్బంది రక్తహీనత నిర్ధారణ పరీక్షలు శరవేగంగా జరుపుతున్నారు. చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యాధికారులు మంగళవారం విస్తృతంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేసారు. హిమోగ్లోబిన్ తక్కువ శాతం ఉన్న వారిని సమీప పీహెచ్‌సీలకు తీసుకువెళ్లి ప్రత్యేక చికిత్సకు సిఫారసు చేశారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ సహకారంతో రక్తహీనత నిర్ధారణ పరీక్షలను నిరంతరం చేపట్టి ప్రజలకు మెరుగైన ఆరోగ్యానికి భరోసా కల్పిస్తామని వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్ పేర్కొన్నారు.

పాదలాడ ఫొటోగ్రాఫర్‌కు వెండి పతకం



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న రవితేజ

రాజోలు: ఫొటోగ్రాఫర్లు ఈ నెల 5, 6 తేదీల్లో పాపికొండలులో నిర్వహించిన అంతర్జాతీయ వర్క్‌షాప్‌లో పాదలాడకు చెందిన ఫొటోగ్రాఫర్ కాకర రవితేజ వెండి పతకం అందుకున్నారు. ఈ మేరకు మంగళవారం రవితేజ మంగళవారం మాట్లాడుతూ సిగ్మా అకాడమీ అధ్యక్షుడు ఎంసీ శేఖర్, రాష్ట్ర ఫొటోగ్రఫీ అకాడమీ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రశంసాపత్రంతో పాటు వెండిపతకాన్ని అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాజోలు తాలూకా ఫొటోగ్రాఫర్ల సంఘ నాయకులు మీనన్, స్టాలిన్, సీవీ రావు, సతీష్, ఫ్యాషన్‌శ్రీను, భాను తదితరులు రవితేజను అభినందించారు.

దుస్తుల పంపిణీ

మామిడికుదురు: హుస్సేనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరంలో మంగళవారం 160 మంది పేదలకు దుప్పట్లు, లుంగీలు, చీరలు పంపిణీ చేశారు. కోల్‌కతాకు చెందిన నిఘాత్ సాజిద్ సంస్థ అందించిన దుస్తులను పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మీర్జా కాజిమ్ హుస్సేన్ మాట్లాడుతూ పేదలకు సహాయం అందించడంలో స్వచ్ఛంద సంస్థలు అండగా నిలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి షరీఫ్ హుస్సేన్, రజాక్ అలీ, సర్కిల్ అమ్మరీ, అబ్రార్ హుస్సేన్, నజీద్ హుస్సేన్, నిస్సార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభల తీర్థం నిర్వహణపై సమావేశం

అయినవిల్లి: సంక్రాంతి సందర్భంగా మండలంలోని అయినవిల్లి, ముక్తేశ్వరం, తొత్తరమూడి, మడుపల్లి, వీరవల్లిపాలెం, కె.జగన్నాథపురం తదితర గ్రామాల్లో ప్రభల తీర్థం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో చేసే ఏర్పాట్లపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో మంగళవారం వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో తీర్థం నిర్వహించాలని అందుకు అన్ని శాఖల నుంచి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచ్ కాకర శ్రీనివాస్, విఘ్నేశ్వరస్వామి ఆలయ చైర్మన్ నంబూరి వెంకటరమణరాజు, ఈఓ ఎం.సత్యనారాయణరాజు తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఓర్వలేక పోతున్న విపక్షాలు
- ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



వెలిచేరులో ప్రజలకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



పుల్లేటికుర్రులో లబ్ధిదారులకు పథకాల లబ్ధి వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ఆత్రేయపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడం చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం వెలిచేరులో మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజుతో పాటు పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులతో పాటు సంబంధిత అధికారులతో గడపగడపకూ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రజలు పలు సమస్యలు ఏకరవు పెట్టారు. ఆయన స్పందించి ఆయా శాఖల అధికారులకు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్న తీరును ప్రజలకు వివరించి సలహాలు సూచనలు తీసుకున్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

రూ.19 లక్షలతో నిర్మించిన జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేశారు. రూ.15 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం, రూ.6 లక్షలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు, రూ.15 లక్షలతో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం షెల్టర్ ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేశారు. మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, రాష్ట్ర అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ డైరెక్టర్ కప్పల శ్రీధర్, కొల్లి శ్యాంసన్, కునాథరాజు రంగరాజు, పెద్దింటి వేణుగోపాల్, సర్పంచ్ వేముల శ్రీనివాస్, ఎంపీడీవో నాతిబుజ్జి, తహసీల్దార్ అనిల్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల పరిస్థితి మెరుగుపడేలా పాలన: కొండేటి

అంబాజీపేట: పేదల జీవన ప్రమాణాలు పెంపొందించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పుల్లేటికుర్రులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ప్రజల సంక్షేమంతో పాటు రాష్ట్ర ప్రగతి కోసం సీఎం జగన్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. గడపగడపకూ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుంటున్నామన్నారు. సమస్యలు లేని ఇళ్లు చూడాలన్నదే జగనన్న ఆశయమన్నారు. ఏ ఇంటికి వెళ్లినా లబ్ధిదారులు ఎదురొచ్చి తమకు చేకూరిన పథకాల లబ్ధి గురించి వివరిస్తున్నారన్నారు. హౌసింగ్ లోన్లు, ఇళ్ల స్థలాలు, పట్టాలు, పింఛన్లు ఇప్పించాలని, డ్రైనేజీ, రహదారులు నిర్మించాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే చిట్టిబాబు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు కొర్లపాటి కోటబాబు, వాసంశెట్టి రాంబాబు, ఎంపీటీసీలు వడలి కృష్ణమూర్తి, కుసుమ వెంకటేష్, వాసంశెట్టి చినబాబు, నందుల ఆదినారయణ, అందే వెంకట ముక్తేశ్వరరావు, కాండ్రేగుల గోపాలకృష్ణ, చిట్టూరి రాధాబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోమసుందరరెడ్డి జయంతి



రావులపాలెంలో తండ్రి విగ్రహానికి నివాళులర్పిస్తున్న తనయుడు, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు



ఊబలంకలో విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు



ఆలమూరు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు ఇస్తున్న చల్లా ప్రభాకరరావు తదితరులు

- మాజీ ఎమ్మెల్యేకి పలువురి ఘన నివాళి

రావులపాలెం: మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందరరెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం గోపాలపురంలోని కాలువ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే గ్రామపెద్దలు, పార్టీ శ్రేణులు కూడా నివాళులు అర్పించారు. కేకు కట్ చేసి అందరికీ పంచారు. అనంతరం రావులపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద, అలాగే పోలీస్‌స్టేషన్ వద్ద జాతీయ రహదారి చెంతన ఉన్న సోమసుందరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డితో పాటు సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉపసర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కర్రి వీర్రెడ్డి, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఊబలంక, వెదిరేశ్వరం, చిన్నవారిపాలెం తదితర గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, సోమసుందరరెడ్డి అభిమానులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పలువురు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే దివంగత చిర్ల సోమసుందరరెడ్డి కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తుచేసుకుని కొనియాడారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ సోమసుందరరెడ్డి తనయుడినని చెప్పుకోవడానికి ఎంతో గర్వపడుతున్నానన్నారు. ఆయన చేసి మంచిపనుల వల్లే ఈ రోజు ఎంతో మంది అభిమానులు ఆయనను తలచుకుంటున్నారన్నారు. జయంతి రోజున సేవా కార్యక్రమాలు చేస్తున్న ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వృద్ధులకు, దివ్యాంగులకు భోజనాలను జగ్గిరెడ్డి స్వయంగా వడ్డించారు.

కాశీ అన్నపూర్ణాదేవి సేవాసమితి సేవలు అభినందనీయం

కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సేవలు అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఊబలంక మదర్ థెరిసా హాస్టల్ వార్షికోత్సవం, సోమసుందరరెడ్డి జయంతి వేడుకల్లో భాగంగా కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులను ఘనంగా సత్కరించి వారికి ఎమ్మెల్యే జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు హాస్టల్ దివ్యాంగులకు నూతన దుస్తులను సంక్రాంతి కానుకగా అందజేశారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో దివంగత కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందరరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో స్థానిక వైఎస్ విగ్రహం వద్ద పార్టీ శ్రేణులు సోమసుందరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆలమూరులో పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సోమసుందరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి రోగులకు పండ్లు, రొట్టెలను అందజేశారు. వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, ఎంపీటీసీ ఉన్నమట్ల విజయకుమారి, దొండపాటి చంటి, బుడ్డిగ వీర వెంకట్రావు, నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: నియోజకవర్గ చరిత్రలో పార్టీ రహిత ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందిన ఏకైక నేత, మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందరరెడ్డి అని సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు, గంటి సర్పంచ్ సాగి బంగార్రాజు అన్నారు. సోమసుందరరెడ్డి జయంతిని పురస్కరించుకుని గంటిలో సోమసుందరరెడ్డి విగ్రహానికి సర్పంచ్ బంగార్రాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముళ్ల జనార్దన్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మట్టపర్తి వెంకట్రావు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

రావులపాలెం: పింఛన్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని ఊబలంకలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేతుల మీదుగా సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తొలుత అంబేడ్కర్, బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పింఛన్‌ను పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక మహిళలు క్షీరాభిషేకం చేస్తున్నట్లు స్థానిక అన్నా మినీ స్ట్రీస్‌కు వచ్చిన నార్వే దేశస్తులైన మోనా కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వివరించారు. అలాగే రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పాలనను వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు కూడా సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

కంప్యూటర్ సైన్స్‌లో శ్రీనివాస్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనివాస్

మామిడికుదురు: థైరాయిడ్ వ్యాధి నివారణ మందులపై మెషీన్ లెర్నింగ్ ఉపయోగించి చేసిన పరిశోధనలకు గాను అప్పనపల్లికి చెందిన కటికిరెడ్డి శ్రీనివాస్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన మంగళవారం తెలిపారు. గుంటూరుకు చెందిన కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ కంప్యూటర్ సైన్స్‌లో తనకు ఈ పట్టా అందించిందన్నారు. డాక్టర్ కేవీడీ కిరణ్ పర్యవేక్షణలో ఇటీవల గుంటూరులో జరిగిన సమావేశంలో తనకు పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేశారని చెప్పారు. శ్రీనివాస్ బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ కం హెచ్‌ఓడీగా పని చేస్తున్నారు. ఇతడు అప్పనపల్లికి చెందిన కంకిపాటి సూర్యారావు–ఆదిలక్ష్మి ఫౌండేషన్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. పీహెచ్‌డీ పట్టా అందుకున్న శ్రీనివాస్‌ను ఫౌండేషన్ చైర్మన్ కంటిపాటి వెంకటేశ్వరరావుతో పాటు పలువురు ప్రముఖులు అభినందించారు.

అధిక దిగుబడులే లక్ష్యంగా రైతుల్లో చైతన్యం

కొత్తపేట: ప్రస్తుత రబీ (దాళ్వా) పంట అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో నీరు, ఎరువులు, పురుగు మందుల వాడకంలో యాజమాన్య పద్ధతులు అవలంబించేలా రైతులను చైతన్యవంతులను చేయాలని వ్యవసాయ శాఖ స్థానిక అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) ఎం.వెంకటరామారావు వీఏఏ, వీహెచ్‌ఏలకు సూచించారు. దాళ్వా ప్రారంభమైన నేపథ్యంలో వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం మండలాల వీఏఏ, వీహెచ్‌ఏలకు కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఆర్‌బీకే పరిధిలో అవసరమైన రసాయన ఎరువులకు ఇండెంట్ పెట్టి రైతులకు సరఫరా చేయడం ద్వారా ఎరువుల కొరత లేకుండా చూడాలని సూచించారు. రసాయన ఎరువులు–ఆర్గానిక్ (సేంద్రియ ఎరువులు), జీవన ఎరువులు సమ్మిళితం చేసి, ఎరువుల యాజమాన్యం చేపట్టి తెగుళ్లు, చీడపీడలు రాకుండా చూడాలని దిశా నిర్దేశం చేశారు. ఈ నెల 15 నాటికి ఈకేవైసీ, 22 నాటికి ఈ క్రాప్ పూర్తి చేయాలని, సీసీఆర్‌సీ కార్డుదారులను గ్రూపులుగా ఏర్పాటు చేసి బ్యాంక్ రుణాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

కొత్తపేట/ఆలమూరు/మలికిపురం/సఖినేటిపల్లి/రావులపాలెం/అయినవిల్లి/రాజోలు: కోనసీమ వ్యాప్తంగా పలు మండలాల్లోని స్కూళ్లు, కాలేజీల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో వచ్చి సందడి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



అంతర్వేది దేవస్థానం పాఠశాలలో భోగి మంట



మలికిపురంలో సంప్రదాయ సంక్రాంతి సంబరాలు



కొత్తపేట డిగ్రీ కళాశాల సంక్రాంతి సంబరాలు



ఆలమూరులో వివిధ వేషధారణల్లో విద్యార్థులు



ముక్తేశ్వరం సంక్రాంతి సంబరాల్లో రంగవల్లులు



రావులపాలెంలో ఎద్దుల బండిపై విద్యార్థులు

తాగునీరు అందించేందుకు కార్యాచరణ



వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మామిడికుదురు: రాజోలు నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కార్యాచరణ చేపట్టామని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. మామిడికుదురులో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.98.93 లక్షలతో నిర్మించనున్న 90 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించనున్న తాగునీటి ట్యాంకు పనులకు మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.నాలుగు లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. స్వచ్ఛభారత్ నిధులు రూ.మూడు లక్షలతో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, స్థలదాత యాలి జగన్నాథరావు కుటుంబ సభ్యులు, ఎంపీటీసీలు నయినాల సీతా మహాలక్ష్మి, వర్ధినేని రాము, పీఏసీఎస్ చైర్మన్లు కటకంశెట్టి ఆదిత్యకుమార్, బొలిశెట్టి భగవాన్, యాలి శ్రీనివాస్, కుసుమ శ్రీధర్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయశ్రీ పాల్గొన్నారు.

రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం

అంబాజీపేట: జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీటీసీ బుడితి సత్యనారాయణమ్మ అన్నారు. ఇరుసుమండలో పంచాయతీ కార్యదర్శి రాయి ఏడుకొండలు చంటి అధ్యక్షతన జలజీవన్ మిషన్‌పై అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. త్వరలో ప్రజలందరికీ రక్షిత తాగునీటిని అందిస్తామన్నారు. వాటిని దుర్వినియోగపరచకుండా వృథా చేకూడదన్నారు. కార్యక్రమంలో జలజీవన్ మిషన్ నియోజకవర్గం కన్వీనర్లు బి.చందు, భూపతి రమణ, జి.సురేంద్ర, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అదనపు తాగునీటి ట్యాంకులు నిర్మించాలి

సఖినేటిపల్లి: కేంద్ర ప్రభుత్వ సహకారంతో జరుచుతున్న జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా 2024 నాటికి గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిలు ఇవ్వాలన్న లక్ష్యానికి అనుగుణంగా అదనపు ట్యాంకుల నిర్మాణాలను చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కో ఆపరేటివ్ సెల్ డైరెక్టర్ మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. మంగళవారం టేకిశెట్టిపాలెంలో జరిగిన ఒక కార్యక్రమంలో అధికారులకు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఆయా పంచాయతీల్లో కార్యాచరణ కమిటీలను ఏర్పాటు చేసి, కమిటీల ద్వారానే పైపులైన్లు నిర్మాణం చేపట్టాలని నగేష్ అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు చెంపాటి శివరామకృష్ణంరాజు, కటికిరెడ్డి శ్రీనివాసరావు, తిరుమల వెంకటేశ్వరరావు, ఆచంట సుబ్బారావు, అద్దేపల్లి సుబ్బారావు, నంద్యాల ప్రసాద్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

రావులపాలెం: మండలంలో ఊబలంకలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులను మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్థానిక నాయకులతో కలసి పరామర్శించారు. రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన చింతా వీరలక్ష్మి కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయ సహకారాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

బాలాజీ సన్నిధిలో మీడియా సలహాదారు అమర్

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని మంగళవారం రాష్ట్ర మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలసి వచ్చిన అమర్‌కు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ దేవేరులతో కొలువుదీరిన స్వామిని దర్శించుకున్న అనంతరం అర్చకుల నుంచి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, కార్యనిర్వహణాధికారి అమర్‌కు స్వామి వారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టాల సత్తిబాబు, ఆలయ ఉప ప్రధానార్చకుడు మద్దాలి తిరుమలశింగరాచార్యులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్రెయిన్ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: అందరూ బాగుండాలి, అందులో మేము ఉండాలన్న లక్ష్యంతో సత్య ప్రేమ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన బ్రెయిన్ వ్యాధిగ్రస్తుడికి మహిళా టీచర్ ఆర్థికసాయం మంగళవారం పంపిణీ చేసిన వైనమిది. సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న జి.పద్మావతి ఈ ట్రస్ట్ ద్వారా సమకూర్చిన రూ.30 వేల నగదును సఖినేటిపల్లిలంకకు చెందిన బాధితుడు వాస్కూరి దుర్గారావుకు, స్థానిక నాయకుడు రేవూరి ఏసు రాజా ద్వారా పంపిణీ చేసిన వైనంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన బ్రెయిన్ వ్యాధిగ్రస్తుడు దుర్గారావుకు మొదటిసారి లక్షలు వెచ్చించి చేసిన ఆపరేషన్ సక్సెస్ కాలేదు. దీంతో రెండో దఫా ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించినట్టు ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో సాయం చేయాలన్న ఆలోచనతో 2009లో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులతో తనకున్న వాట్సాప్ గ్రూపులో పై విషయాన్ని షేర్ చేశానన్నారు. గ్రూపులోని వారు కూడా స్పందించారన్నారు. అలాగే సఖినేటిపల్లిలంకలో సహచర ఉద్యోగులకు కూడా దీనిపై సహకరించారన్నారు. వీటితో బాటు తన కుటుంబ తరపున కొంత మొత్తాన్ని జమ చేశామన్నారు. ఈ విధంగా సమకూర్చిన పై మొత్తం రూ.30 వేలు బాధితుడికి అందజేశామన్నారు.

ఉద్యాన పరిశోధన కేంద్రం సందర్శన



అంబాజీపేటలో జిన్నూరి వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న శాస్త్రవేత్తలు

అంబాజీపేట: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు మంగళవారం సందర్శించారు. పరిశోధన కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలు, కొబ్బరిలో రకాలు, కొబ్బరి జీన్‌లను పరిశీలించారు. అనంతరం ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, సిబ్బంది దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు, బి.నీరజ, ఎ.కిరీటి, డాక్టర్ వి.అనూష, రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ జి.కోటేశ్వరరావు, ఉప్పలగుప్తం వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రాయపురెడ్డి నాగు, సొసైటీ చైర్‌పర్సన్ నాగాబత్తుల సత్యానందరావు, వంగా గిరిజాకుమారి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం



అంతర్వేది దేవస్థానంలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం అంతర్వేది దేవస్థానంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.79 లక్షలతో చేపట్టనున్న మూడు అదనపు తరగతి గదులకు, మనబడి నాడు–నేడు రెండో విడత పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, ఎంపీపీ వీరా మల్లిబాబు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంఈవో నల్లి మనోహరం, ఎంపీటీసీ బైర నాగరాజు, సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీను, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, సీనియర్ నాయకుడు గెడ్డం అమ్ములు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

రావులపాలెం: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. పీఎంసీ చైర్మన్ గొలుగూరి సత్యనారాయణరెడ్డి సమకూర్చిన మోడల్ టెస్ట్ పేపర్లను 90 మంది తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో వైవీఎస్ బాలాజీ, లింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వేగేశ్న' ట్రస్టు సేవలు అభినందనీయం

ఆత్రేయపురం: ప్రముఖ ఎన్‌ఆర్‌ఐ వేగేశ్న రామకృష్ణంరాజు (గోపిలీల) వేగేశ్న ట్రస్టు ద్వారా గ్రామాల్లో చేస్తున్న సేవలు, అలాగే ఆయన తల్లిదండ్రుల విగ్రహాలను తన స్వగృహం వద్ద ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అభినందించారు. మంగళవారం గోపిలీల ఏర్పాటు చేసిన తన తల్లిదండ్రులు వెంకట సత్యనారాయణ రాజు, వెంకట సుబ్బమ్మ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొని ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ చిలువూరి రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ఐదు లారీల సీజ్

పి.గన్నవరం: నాగుల్లంక శివారు పెదకందాలపాలెం లంక నుంచి ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా మట్టిని తరలిస్తున్న ఐదు లారీలను పోలీసు, ఎస్‌ఈబీ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. పెదకందాలపాలెం నుంచి వస్తున్న రెండు లారీలను ఎస్సై పి.గంగాభవాని తనిఖీ చేయగా, వాటికి ఎటువంటి పత్రాలు లేవు. దీంతో రెండు లారీలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే ఎస్‌ఈబీ అధికారులు మరో మూడు లారీలను సీజ్ చేసి, తమకు అప్పగించారని ఎస్సై తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం ఐదు లారీలను తహసీల్దార్‌కు అప్పగించినట్టు ఎస్సై వివరించారు.

యువతి అదృశ్యంపై కేసు

అయినవిల్లి: ఓ యువతి అదృశ్యంపై అయినవిల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. దీనికి సంబంధించి ఎస్సై ఎస్.నాగేశ్వరావు తెలిపిన వివరాలివి ప్రకారం.. మండలంలోని తొత్తరమూడి నామాడివారి పేటకు చెందిన కొనాల దివ్యసుందరి (20) ఈ నెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లి మరలా తిరిగి రాలేదు. ఆమె పదో తరగతి వరకూ చదివింది. దీనిపై ఆమె తండ్రి వెంకటేష్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రోన్‌లతో భూముల రీసర్వే

ఆత్రేయపురం: మండలంలోని వద్దిపర్రులో డ్రోన్‌ల సహాయంతో జరుగుతున్న భూముల రీసర్వే పనులను ఎంపీడీవో నాతిబుజ్జి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ సర్వే జరుగుతుందన్నారు. చాలా వరకూ అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొరుప్రోలు వెంకటేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా లక్షతులసి పూజ

మామిడికుదురు: ధనుర్మాసం సందర్భంగా పెదపట్నంలంకలో కొలువుదీరిన కోదండ రామాలయంలో మంగళవారం లక్షతులసి పూజను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ వాడపల్లి శేషాచార్యుల ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించడంతో పాటు పలు ప్రత్యేక పూజలు జరిపించారు. పలువురు భక్తులు ఈ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.